వాయిస్ ఆఫ్ ప్రజలు

# వాయిస్ టుడే

TGTEL/25/A2649

VOICE OF PRAJALU

తెలుగు దినపత్రిక

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

బుధవారం, ఫిబ్రవరి 25, 2026

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ఏపీలో 24 గంటల పోస్టల్ సేవలు.. ఇక రాత్రిపూట కూడా పార్శిల్ బుకింగ్



ఏపీ ప్రజలకు తపాలా శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రధాన నగరాల్లో ఇకపై 24 గంటలూ స్పీడ్ పోస్ట్, పార్శిల్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయంతో రాత్రింబవళ్లు ఎప్పుడైనా పోస్టల్ సేవలను వినియోగించుకునే వెసులుబాటు ప్రజలకు కలిగింది. తొలి దశలో భాగంగా రాష్ట్రంలోని 11 ముఖ్య నగరాల్లో ఈ 24/7 సౌకర్యాన్ని ప్రారంభించారు. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు, గుంతకల్లు ప్రధాన తపాలా కార్యాలయాల్లో ఈ సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయి.



### సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ

## కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం

- 'సేవా తీర్థ్' నూతన ప్రాంగణంలో ప్రధాని మోదీ అధ్యక్షతన తొలి కేబినెట్ సమావేశం
- దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాకు ఆమోదం
- కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చేందుకు గ్రీన్ సిగ్నల్
- భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు 'సేవా సంకల్ప్'
- రూ.12,236 కోట్లతో రైల్వే, మెట్రో సహా పలు మౌలిక ప్రాజెక్టులకు ఆమోదముద్ర

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన 'సేవా తీర్థ్' సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును 'కేరళం'గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. దీంతో పాటు, రాబోయే రోజుల్లో భారత్‌ను ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి

(మిగతా 2వ పేజీలో)

### మావోయిస్టు ఉద్యమం

# ముగింపు దశకు

- తెలంగాణకు చెందిన మావోయిస్టులు కేవలం 11 మందే మిగిలినట్లు వెల్లడి
- సరెండర్ పాలసీ ప్రభావంతో చర్చల దిశగా అడుగులు
- రెండేళ్లలో వందలాది మంది జనజీవన స్రవంతిలోకి
- పునరావాసంతో ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడంపై దృష్టి
- కీలక నేతల స్థానం, కదలికలపై నిఘా కొనసాగుతున్నట్టు స్పష్టం

### అగ్రనేతల లొంగుబాటుతో ఉద్యమానికి భారీ దెబ్బ



హైదరాబాద్: తెలంగాణలో ప్రారంభమైన మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు ముగింపు దశకు చేరుకుందని రాష్ట్ర డీజీపీ బి.శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన మావోయిస్టుల్లో ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నవారు కేవలం 11 మంది మాత్రమే ఉన్నారని, వారిలో చాలా మంది ఇప్పటికే అధికార యంత్రాంగంతో సంప్రదింపుల్లోకి వచ్చినట్టు తెలిపారు. చర్చలు సానుకూల దిశగా సాగుతున్నాయని, త్వరలోనే వారు కూడా సాయుధ పోరాటాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. మావోయిస్టు పార్టీకి చెందిన కీలక అగ్రనేతలు సాయుధ పోరాటాన్ని విరమించి అధికారుల సమక్షంలో లొంగిపోవడం ఈ ప్రక్రియలో కీలక మలుపుగా భావిస్తున్నారు. కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్ల రాజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి తదితరులు డీజీపీ ఎదుట లొంగిపోవడం ఉద్యమ బలహీనతను సూచిస్తున్న పరిణామంగా భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అదనపు డీజీలు, ఇంటెలిజెన్స్ అధికారులు, ఎస్ఐబీ ఉన్నతాధికారులతో కలిసి డీజీపీ ఈ వివరాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి పిలుపు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సరెండర్ మరియు పునరావాస విధానాలు లొంగుబాట్లకు ప్రధాన కారణమయ్యాయని ఆయన తెలిపారు. గత రెండేళ్లలోనే నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు సహా మొత్తం 544 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారని, మొత్తం లెక్కల్లో చూస్తే ఇప్పటివరకు 5,865 మంది సాయుధ మార్గాన్ని విడిచారని పేర్కొన్నారు. లొంగిపోయిన వారిపై కేసుల విషయంలో సానుభూతితో వ్యవహరిస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అవసరమైతే వారి

(మిగతా 2వ పేజీలో)



### ఆదిలాబాద్ జైలులో

## బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

- సీఎం రేవంత్‌రెడ్డిపై కఠిన వ్యాఖ్యలు
- కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారనే వ్యాఖ్య
- కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు
- ఎన్నికల నిర్వహణలో పారదర్శకతపై డిమాండ్
- రాజకీయ కేసుల్లో పక్షపాతంపై ప్రశ్నలు

ఆదిలాబాద్ టౌన్: రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ఉద్రిక్త వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిరిగి జైలుకు వెళ్లే పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. జైలులో ములాఖత్ అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ ప్రతీకార ధోరణితో

(మిగతా 2వ పేజీలో)

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

### ::: ఏపీ క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం

- ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ శాఖ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం
- ధృవీకరణ పత్రాలున్న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి గ్రీన్ సిగ్నల్
- విశాఖలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం
- రాష్ట్రవ్యాప్తంగా పలు పర్యాటక, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు పచ్చజెండా
- కల్తీ పాలు, డయేరియా ఘటనలపై సీఎం సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్' పేరిట కొత్త శాఖను ఏర్పాటు చేసే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పాలనా సౌలభ్యం పెంచి, అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 55 అజెండా అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో ముఖ్యంగా, ధృవీకరణ పత్రాలు కలిగిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపే క్రమంలో విశాఖపట్నంలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు

(మిగతా 2వ పేజీలో)



### కుటుంబ విషాదం: అప్పుల ఒత్తిడితో తల్లి హత్య, తండ్రీకొడుకుల ఆత్మహత్య

- అంబర్‌పేటలో దారుణ ఘటన వెలుగులోకి
- వ్యాపార నష్టాలతో అప్పుల్లో కుటుంబం
- ముందుగా తల్లిని హతమార్చిన కుమారుడు
- ఆపై వేర్వేరు గదుల్లో తండ్రీకొడుకుల ఆత్మహత్య
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఘటనతో కుటుంబ సభ్యుల్లో తీవ్ర శోకం



### ఆపరేషన్ ఆక్టోపస్... డీటెయిల్స్ వెల్లడించిన సజ్జనార్

- 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో దేశవ్యాప్త సైబర్ ముఠా అరెస్ట్
- 16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు.. 104 మంది అరెస్ట్
- నిందితులకు సహకరించిన బంధన్ బ్యాంక్ అధికారి కూడా అరెస్ట్
- దేశవ్యాప్తంగా 127 కోట్ల మోసాలు చేసినట్లు గుర్తింపు
- 36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు స్వాధీనం

## పారదర్శక చర్చ జరగాలంటే మైక్, కెమెరాపై ఆంక్షలు వద్దు: హరీశ్

- సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నేత
- దేవాదుల ప్రాజెక్టు ఆలస్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం
- ఎన్ని రోజులైనా విస్తృత చర్చకు సిద్ధమని స్పష్టీకరణ
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల నత్తనడకపై విమర్శలు
- ప్రజలే తుది తీర్పు చెప్పాలని రాజకీయ సవాల్



ఏటూరునాగారం: సాగునీటి ప్రాజెక్టులు, ముఖ్యంగా గోదావరి జలాల వినియోగంపై అసెంబ్లీలో సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు వెల్లడించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ, అసెంబ్లీ వేదికపై పూర్తి స్థాయి చర్చ నిర్వహిస్తే వాస్తవాలు బయటపడతాయని ఆయన పేర్కొన్నారు. చర్చ జరుగుతున్న సమయంలో మైక్ కట్ చేయడం, కెమెరా తిప్పడం వంటి పరిమితులు లేకుండా పారదర్శకంగా చర్చ జరగాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అసెంబ్లీ చర్చలు ప్రజలకు నేరుగా చేరాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని దేవాదుల ఎత్తిపోతల పంప్‌హౌస్ పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన హరీశ్‌రావు, ప్రస్తుత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల విషయంలో స్పష్టతతో వ్యవహరించడం లేదని విమర్శించారు. మంత్రులకు ఒక గడువు, ముఖ్యమంత్రికి మరో గడువు

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ టుడే
జనగాత్రం - మనస్తేజం
బుధవారం, ఫిబ్రవరి 25, 2026

# మావోయిస్టు ఉద్యమం ముగింపు దశకు



భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మావోయిస్టు కేంద్ర కమిటీలో కీలకంగా ఉన్న కొంతమంది నేతలు అడవుల బయట షెల్టర్ జోన్‌లలో ఉన్నట్టు స మాచారముందని, వారి కదలికలపై నిఘా కొనసాగుతోందని డీజీపీ వెల్లడించారు. ప్రస్తుతం కేంద్ర కమిటీలో కొద్ది మంది మాత్రమే మిగిలి ఉన్నారని, సంస్థ నిర్మాణం గణనీయంగా బలహీనపడిందని అన్నారు. అగ్రనేతల వరుస లొంగుబాట్లు ఉద్యమానికి వ్యూహాత్మకంగా పెద్ద దెబ్బగా మారాయని ఆయన అభిప్రాయపడ్డారు. లొంగుబాట్ల ప్రక్రియలో కీలకంగా పనిచేసిన ఇంటెలిజెన్స్ విభాగం, ఎస్ఐబీ బృందాల పాత్రను డీజీపీ ప్రశంసించారు. ముఖ్యంగా చర్చల ద్వారా, నమ్మకాన్ని పెంచుతూ, హింసాత్మక మార్గాన్ని విడిచేలా ప్రేరేపించడం ద్వారా మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. పునరావాస పథకం కింద లొంగిపోయిన అగ్రనేతలకు ఆర్థిక సహాయం, జీవనోపాధి అవకాశాలు కల్పించడం కూడా ఈ విధానంలో భాగమని పేర్కొన్నారు. ఇక తెలంగాణకు చెందిన మిగిలిన మావోయిస్టు సభ్యుల వివరాలు కూడా భద్రతా సంస్థల వద్ద ఉన్నాయని, వారితో నిరంతర సంప్రదింపులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. వారు కూడా లొంగిపోతే మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన కార్యకర్తలు పూర్తిగా బయటకు వచ్చినట్టే అవుతుందని డీజీపీ స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి మరింత బలపడుతుందని, సాయుధ పోరాటం కన్నా సామాజిక ప్రధాన ప్రవాహంలోకి రావడమే శ్రేయస్కరమని ప్రభుత్వం భావిస్తున్నట్టు ఆయన తెలిపారు.

# ఆదిలాబాద్ జైలులో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్



వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తారని, ఆ సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డిని ఎక్కడ ఉన్నా చట్టపరంగా వదిలిపె ట్టబోమని తీవ్రంగా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ పాలకవర్గ ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లిలో బీఆర్ఎస్ 14 స్థానాలు గెలిచినా, ఏడు స్థానాలు గెలిచిన కాంగ్రెస్ అధికార దాహంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్‌లు అపహాస్యం చేస్తున్నారని అన్నారు. బాల్క సుమన్ జైలుకు వెళ్లడం కొత్త విషయం కాదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నోసార్లు జైలుకు వెళ్లిన పోరాట యోధుడని కేటీఆర్ పేర్కొన్నారు. రాజకీయ నాయకులపై కేసుల నమోదులో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులపై విమర్శలు చేసినప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. అసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై కేసు నమోదు చేయడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. చట్టాల పట్ల గౌరవం, ప్రజల తీర్పు పట్ల బాధ్యత ప్రభుత్వానికి ఉండాలని, కానీ ప్రస్తుత పాలనలో రాజకీయ ప్రయోజనాలే ముందున్నాయని వ్యాఖ్యానించారు. రాహుల్ కుటుంబానికి వెయ్యి కోట్లు కేటాయింపులపై చేసిన ఆరోపణల విషయంలో అమలు సంస్థలు స్పందించకపోవడంపై కూడా కేటీఆర్ సందేహం వ్యక్తం చేశారు. రైతులకు రైతుబంధు వంటి పథకాలను సక్రమంగా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, పాలనను నిర్లక్ష్యం చేసి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని మండిపడ్డారు. రెండేళ్ల కాలంలో భారీ నిధులు ఢిల్లీకి తరలించేలా ముఖ్యమంత్రి వద్ద సిద్ధంగా ఉన్నాయనే ఆరోపణలు చేస్తూ, ఇది రాష్ట్ర ప్రజల ధనంపై ప్రభుత్వం చూపుతున్న ధోరణిని ప్రతిబింబిస్తోందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ములాఖత్‌లో పాల్గొన్నారు. కేటీఆర్ జైలుకు వచ్చిన విషయం తెలిసిన బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని తమ మద్దతు తెలిపారు. దీంతో జైలు పరిసరాల్లో రాజకీయంగా ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది.

# కుటుంబ విషాదం: అప్పుల ఒత్తిడితో తల్లి హత్య, తండ్రీకొడుకుల ఆత్మహత్య

**అంబర్‌పేటలో దారుణ ఘటన వెలుగులోకి**

**వ్యాపార నష్టాలతో అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబం**

**ముందుగా తల్లిని హతమార్చిన కుమారుడు**

**ఆపై వేర్వేరు గదుల్లో తండ్రీకొడుకుల ఆత్మహత్య**

**సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**ఘటనతో కుటుంబ సభ్యుల్లో తీవ్ర శోకం**



అంబర్‌పేట: ఆర్థిక సంక్షోభం ఒక కుటుంబాన్ని పూర్తిగా ఛిద్రమయ్యేలా చేసింది. హోటల్ వ్యాపారంలో వరుస నష్టాలు రావడంతో తండ్రీకొడుకులు తీవ్ర అప్పుల బారిన పడి మానసిక ఒత్తిడికి గురయ్యారు. చివరకు ఆ ఒత్తిడిని తట్టుకోలేక కుటుంబ సమేతంగా ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆ నిర్ణయం అమలు చేసే క్రమంలో కుమారుడు ముందుగా తల్లిని హతమార్చి, తర్వాత తండ్రితో కలిసి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన నగరంలోని అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని బాపూనగర్‌లో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారంఁ కాకతీయలైన్‌లో నివసిస్తున్న వ్యాపారవేత్త రామరాజు (54) గత కొన్నేళ్లుగా హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతని కుమారుడు శశాంక్‌రాజ్ (27) కూడా తండ్రికి తోడుగా అదే వ్యాపారం చూసుకుంటున్నాడు. ఇటీవల కాలంలో వ్యాపారం మందగించడం, వరుస నష్టాలు రావడం వల్ల వీరికి అప్పులు భారీగా పెరిగాయి. అప్పుదారుల నుంచి తిరిగి చెల్లింపుల కోసం ఒత్తిళ్లు పెరగడంతో ఇద్దరూ తీవ్ర మానసిక ఆందోళనలోకి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి తండ్రీకొడుకులు దీర్ఘంగా చర్చించుకుని జీవితాన్ని ముగించుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అదే భవనంలో కింద అంతస్తులో నివసిస్తున్న రామరాజు సోదరుడి ఇంటికి కుటుంబ సభ్యులు వెళ్లి కొంతసేపు గడిపి తిరిగి వచ్చారు. మంగళవారం ఉదయం 3.30 గంటల సమయంలో శశాంక్ తన మిత్రుడు రవికి ఫోన్ సందేశం పంపి తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలియజేశాడు. అనంతరం ఆర్థిక ఇబ్బందుల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంటూ సూసైడ్ నోట్ రాసి, దానిపై తండ్రి సంతకం చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఈ నిర్ణయం భార్య మాధవి (50)కి ముందుగా తెలిసిందా లేదా అన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. తాము లేకపోతే తల్లి ఒంటరిగా జీవించడం కష్టమవుతుందని శశాంక్ భావించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో బెడ్‌రూమ్‌లో నిద్రిస్తున్న తల్లి ముఖంపై దిండుతో అదిమిపట్టి హతమార్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన స్థల పరిస్థితులు కూడా అదే సూచిస్తున్నాయని పేర్కొన్నారు. తల్లి మృతి చెందిన అనంతరం తండ్రి రామరాజు అదే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తర్వాత మరో గదిలోకి వెళ్లిన శశాంక్ ముందుగా కత్తితో చేతి నరాలను కోసుకుని చనిపోవడానికి ప్రయత్నించినట్లు గాయాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. కొన్ని గాయాలు చేసుకున్న తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకుని చివరకు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉదయం 8 గంటల ప్రాంతంలో శశాంక్ పంపిన సందేశాన్ని గమనించిన మిత్రుడు రవి వెంటనే వారి ఇంటికి చేరుకుని చూసే సరికి ఈ ఘటన బయటపడింది. శశాంక్‌ను కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో కలిసి ఆధారాలు సేకరించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్య చేస్తున్నట్లు రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రామరాజు కుమార్తె అమూల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటన తెలిసి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రామరాజు సోదరుడు జగదీశ్వర్ 2009లో బీఆర్ఎస్ తరపున అంబర్‌పేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినట్లు తెలిపారు. తమ తమ్ముడు ఆర్థిక ఇబ్బందుల గురించి ఎప్పుడూ చెప్పలేదని, విషయం ముందుగా తెలిసి ఉంటే తప్పకుండా సహాయం చేసేవాళ్లమని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

# ఆపరేషన్ ఆక్టోపస్... డీటెయిల్స్ వెల్లడించిన సజ్జనార్

**'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో దేశవ్యాప్త సైబర్ ముఠా అరెస్ట్**

**16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు.. 104 మంది అరెస్ట్**

**నిందితులకు సహకరించిన బంధన్ బ్యాంక్ అధికారి కూడా అరెస్ట్**

**దేశవ్యాప్తంగా 1,055 కేసుల్లో ₹127 కోట్ల మోసాలు చేసినట్లు గుర్తింపు**

**36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు స్వాధీనం**

హైదరాబాద్ : హైదరాబాద్ పోలీసులు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో, దేశంలోని 16 రాష్ట్రాల్లో విస్తరించిన అతిపెద్ద సైబర్ నేరాల ముఠా గుట్టురట్టు చేశారు. పెట్టుబడులు, ట్రేడింగ్, 'డిజిటల్ అరెస్ట్' వంటి మోసాలతో అమాయక ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ఈ నెట్‌వర్క్‌కు చెందిన 104 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయి. అమాయకులను నమ్మించి, భయపెట్టి, వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న ఘటనలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో డీసీపీ (సైబర్‌క్రైమ్స్) వి. అరవింద్ బాబు నేతృత్వంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు (జజ్బూూ) ఈ మోసాలపై లోతైన దర్యాప్తు చేపట్టారు. నేరగాళ్లు బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును మళ్లించడానికి ఉపయోగిస్తున్న 151 బ్యాంకు ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరించిన ముఠా వివరాలను ఛేదించారు. ఈ భారీ నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకిలించేందుకు 32 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల నేతృత్వంలోని ఈ బృందాలు 10 రోజుల పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో ఏకకాలంలో మెరుపుదాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో మొత్తం 104 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో 86 మంది 'మ్యూల్ అకౌంట్ హోల్డర్లు' ఉన్నారు. వీరు తమ బ్యాంకు ఖాతాలను కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లకు అప్పగించారు. మరో 17 మంది ఈ ఖాతాలను సేకరించి ముఠా సూత్రధారులకు అందించే ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ ముఠాతో కుమ్మక్కై నకిలీ ఖాతాలు తెరిచేందుకు సహకరించిన బంధన్ బ్యాంకుకు చెందిన ఓ రిలేషన్‌షిప్ మేనేజర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన ఈ నిందితులకు దేశవ్యాప్తంగా నమోదైన 1,055 సైబర్ ఫ్రాడ్ కేసులతో సంబంధం ఉన్నట్లు తేలిందని, ఈ మోసాల మొత్తం విలువ సుమారు రూ.127 కోట్లు ఉంటుందని కమిషనర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్ కార్డులు, 234 డెబిట్/క్రెడిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు, 152 బ్యాంకు పాస్‌బుక్‌లు, 56 కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ బ్రాంచ్) ఎస్.ఎం. విజయ్ కుమార్, డీసీపీ అరవింద్ బాబు పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ విజయవంతమైందని కమిషనర్ ప్రశంసించారు. సైబర్ నేరాల పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నామని, ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ముఠాలోని ప్రధాన సూత్రధారులను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశామని, సైబర్ నేరగాళ్లకు సహకరించే బ్యాంకు అధికారులు, మ్యూల్ ఖాతాదారులతో సహా ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

# సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ
# కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం

ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలబెట్టడమే లక్ష్యంగా 'సేవా సంకల్ప్' పేరిట ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. నేడు 'సేవా తీర్థ్' ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశం దేశ ప్రగతి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది అని కేబినెట్ అభివర్ణించింది. వలసవాద గతం నుంచి ఆత్మవిశ్వాసంతో కూడిన నవ భారతం వైపు సాగుతున్న ప్రయాణానికి ఈ నూతన పరిపాలనా కేంద్రం ఒక శక్తివంతమైన చిహ్నమని తీర్మానంలో పేర్కొన్నారు. 'సేవా తీర్థ్' అనే పేరు సేవ, బాధ్యత, అంకితభావాలకు ప్రతిరూపమని, ఇక్కడ పరిపాలనను ఒక పవిత్ర యాత్రగా భావిస్తామని వివరించారు. ఈ సమావేశంపై ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ.. "స్వదేశీ ఆలోచన, ఆధునిక దృక్పథం, 140 కోట్ల ప్రజల అపార సామర్థ్యంతో భారతదేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు సంకల్పం చేశాం" అని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాల్లో భాగంగా, బాలికల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక (హెచ్‌పీవీ) 'గర్దాసిల్' టీకాను అందించే కార్యక్రమానికి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా, కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించింది. మౌలిక సదుపాయాల కల్పనకు ఊతమిస్తూ సుమారు రూ.12,236 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో అహ్మదాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు, జబల్‌పూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు కూడా ఆమోదం లభించింది. ప్రభుత్వ పరిపాలన అధికార కేంద్రంగా కాకుండా, ప్రజల సాధికారతకు కేంద్రంగా పనిచేయాలని 'సేవా సంకల్ప్' తీర్మానంలో స్పష్టం చేశారు. 'నాగరిక దేవో భవ' (పౌరుడే దైవం) అనే సూత్రాన్ని పాటిస్తూ, ప్రతి నిర్ణయం 140 కోట్ల ప్రజల సేవకే అంకితమవుతుందని పేర్కొన్నారు. గత దశాబ్దంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడాన్ని గుర్తుచేస్తూ.. 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' వేగంతో భారత్‌ను త్వరలోనే ప్రపంచంలోని టాప్-3 ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు దృఢ సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం మీద, ఈ సమావేశం 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక బలమైన పునాది వేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అదేవిధంగా, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, చీరాల, తిరుపతి, సత్యసాయి జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టులతో పాటు సౌర, పవన, హైబ్రిడ్ ఇంధన ప్రాజెక్టులకు కూడా మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) తీసుకున్న నిర్ణయాలను కూడా కేబినెట్ ధృవీకరించింది. కొల్లేరు అభయారణ్య సరిహద్దుల ఖరారుకు సంబంధించి కేంద్రానికి పంపాల్సిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అలాగే, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 28న పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆ రోజు అసెంబ్లీకి సెలవు ప్రకటించాలని కూడా తీర్మానించారు. సమావేశం సందర్భంగా రాజమండ్రిలో కల్తీ పాల ఘటన, శ్రీకాకుళంలో డయేరియా కేసులు ప్రబలడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరో ఆసక్తికర అంశంగా, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రసంగాలను కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో విశ్లేషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిపై చర్చకు మంత్రులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కూడా సూచించారు. తాజా నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# పారదర్శక చర్చ జరగాలంటే
# మైక్, కెమెరాపై ఆంక్షలు వద్దు: హరీశ్

ప్రకటించడం వల్ల ప్రాజెక్టుల అమలు గందరగోళంగా మారుతోందని ఆయన అన్నారు. రోజులు గడుస్తున్నా పనుల్లో గణనీయమైన పురోగతి కనిపించడం లేదని, ఇది ప్రభుత్వ వైఖరిపై అనుమానాలు కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. గత రెండున్నరేళ్ల కాలంలో గోదావరి నదిపై ఒక ప్రధాన ప్రాజెక్టు అయినా పూర్తిచేసారా అని ఆయన ప్రశ్నించారు. సమీక్ష సమావేశాల్లో స్పష్టమైన దిశా నిర్దేశం లేకుండా వ్యాఖ్యలు చేయడం వల్ల అధికార యంత్రాంగంలో సందిగ్ధత నెలకొంటోందని ఆయన అభిప్రాయపడ్డారు. సాగునీటి అంశాల్లో అనుభవం ఉన్నవారిని పక్కనబెట్టి వ్యవహరించడం పరిపాలనా లోపాలకు దారితీస్తుందని ఆయన సూచించారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను మాజీ మంత్రులు, స్థానిక నేతలతో కలిసి పరిశీలించిన అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య అవసరాలకు సంబంధించిన కీలక ప్రాజెక్టు అయిన ఆస్పత్రి నిర్మాణం అనవసరంగా ఆలస్యం కావడం ఆందోళనకరమని అన్నారు. ముందుగా నిర్ణయించిన గడువులోనే ప్రారంభం కావాల్సిన ఈ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదని, పనుల వేగం పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. రాజకీయ కారణాలతో అభివృద్ధి కార్యక్రమాలు మందగించడం రాష్ట్రానికి మంచిది కాదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ప్రాజెక్టులను రాజకీయ కోణంలో చూడకుండా వేగంగా పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. అవసరమైతే ఈ అంశంపై ఉద్యమాత్మకంగా స్పందించేందుకు కూడా తాము వెనుకాడబోమని, ప్రజా సమస్యల విషయంలో రాజీపడబోమని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ చర్చల ప్రసారాల విషయంలో కూడా పారదర్శకత అవసరమని హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. ప్రజల తరఫున ఎన్నికైన ప్రతినిధులు చెప్పే విషయాలు ప్రజలకు పూర్తిగా వినిపించేలా ఉండాలని, ప్రసారాల్లో ఎలాంటి ఆంక్షలు ఉండకూడదని అన్నారు. అదే సమయంలో మీడియా పాత్రను ప్రస్తావిస్తూ, జర్నలిస్టులకు సులభంగా అక్రిడిటేషన్లు ఇవ్వాలని సూచించారు. ప్రజలకు వాస్తవ సమాచారం చేరేందుకు మీడియా స్వేచ్ఛ అత్యంత ముఖ్యమని, గోదావరి జలాలు, సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో జరిగే బహిరంగ చర్చ ద్వారా ఎవరు ఏమి చేశారు అనే విషయంపై స్పష్టత వస్తుందని, తుది నిర్ణయం ప్రజలదేనని ఆయన పేర్కొన్నారు.

వాయిస్ టుడే

బుధవారం, ఫిబ్రవరి 25, 2026

# అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో తెలంగాణ!

## ఆడబిడ్డల కల్యాణంతో ప్రతి ఇంటిలో ఆనంద కిరణాలు!

## చింతకుంట విజయ రమణారావు



సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా ఫిబ్రవరి-24 వాయిస్ టుడే: సుల్తానాబాద్ మండల కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్ లో మంగళవారం సుల్తానాబాద్ మున్సిపల్ తో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన తొంభై తొమ్మిది మంది లబ్ధిదారులకు తొంబై తొమ్మిది లక్షల పదకొండు వేల నాలుగువందల ఎనభై నాలుగు రూపాయలు విలువ గల కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణి చేసిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు పోతుందని గత పాలకులు తొమ్మిది సంవత్సరాల కాలంలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు అందించిన పాపాన పోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో మూడు వందల ముప్పై మూడు రేషన్ కార్డులను అందించామని ఎనిమిది వందల ఇరవై నాలుగు కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. అలాగే నూతనంగా నమోదైన మూడు వేల నాలుగు వందల యాభై రెండు కుటుంబాలు కాగా నాలుగు వేల ఏడు వందలు నమోదయాయని తెలిపారు. మండలంలో కొత్తగా రేషన్ కార్డులు ఇరవై రెండు వేల నూట యాభై రెండు అందించామన్నారు. పూర్తిగా కుటుంబ సభ్యుల సంఖ్య అరవై మూడు వేల ఎనిమిది వందల ముప్పై ఆరు ఉన్నారని తెలిపారు. మండలంలో ప్రతినెల మూడు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల యాభై ఆరు క్వింటాల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో హామీ ఇచ్చిన ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేస్తామని అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తూ ప్రతి పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉండి సుల్తానాబాద్ మండలాన్ని భ్రష్టు పట్టించిందని ఇక్కడ ఉన్న ప్రతి కార్యాలయాన్ని తరలించి ఈ ప్రాంతాన్ని ఎడారిగా మార్చిన చరిత్ర గత పాలకులదన్నారు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్విరామంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని దానికి నిదర్శనమే గ్రామాలలో జరిగిన ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి డెబ్బై శాతం సర్పంచ్ అభ్యర్థులు ఘనవిజయం అందించారని హైదరాబాదు లో జూబ్లీహిల్స్ ఎన్నికలలో కాంగ్రెస్ ఇరవై ఆరు వేల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించిందన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ లో ఎనభై శాతం కాంగ్రెస్ అభ్యర్థులే విజయకేతనం ఎగురవేశారన్నారు. సంక్షేమ పథకాలలో ముందున్నామని మహిళలకు ఫ్రీ బస్సు, రైతులకు సన్న వడ్లకు బోనసు, రైతు బీమా, రైతు భరోసా అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు తోపాటు ఇలా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ముందుకు పోతున్నామని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ లో ఇరవై ఒకటి కోట్లతో సిసి రోడ్ల నిర్మాణం త్వరలోనే చేపడతామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం అయ్యే విధంగా పాలన కొనసాగుతుందని రైతులకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ పాలనలో సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నారు. గత పాలకులను విస్మరించి కాంగ్రెస్ ను ఆదరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, , తాహసిల్దార్ బషీరుద్దీన్, కాంగ్రెస్ నాయకులు వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, అమిరి శెట్టి రాజలింగం పన్నాల రాములు,పట్టణ పదిహేను వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు,వార్డు కౌన్సిలర్లు ఈర్ల స్వరూప, గాజుల రాజ మల్లయ్య, కందునూరి సమత, గరిగే శోభారాణి, బాకం సాయికుమార్, ఉట్ల వరప్రదీప్ చింతల రాజు, టికే ప్రభాకర్, కల్వల శంకరమ్మ, అమిరి శెట్టి,శ్రావణి, సిద్ధ తిరుపతి, వేగోళం పద్మ, గాదాసు మంజుల, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు లబ్ధిదారులు పలువురు పాల్గొన్నారు..

# రాష్ట్రంలో పశువైద్య వ్యవస్థను బలోపేతం చేయాలి

## మండలానికి ఒక పశువైద్యశాల ఏర్పాటు చేయాలి : విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

### చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పశు అక్రమ రవాణా కు అడ్డుకట్ట వేయాలి : యార్లగడ్డ.. వెటర్నరీ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకురావాలి : యార్లగడ్డ



కృష్ణా జిల్లా-గన్నవరం : అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పశుసంవర్ధక శాఖ పనితీరు పశువుల సంరక్షణపై సుదీర్ఘంగా మాట్లాడారు. రాష్ట్రంలో వెటర్నరీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని, బ్రిటిష్ కాలంలో బాగున్న ఈ వ్యవస్థ కాలక్రమేణా ప్రాధాన్యతలు మారి బలహీనపడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, కేవలం గోపాల మిత్రలు, పారామెడికల్ టీమ్‌లతోనే వ్యవస్థ నడుస్తోందని పేర్కొన్నారు. ప్రతి మండలానికి ఒక పశువైద్యశాలను ఏర్పాటు చేసి, తగినంత మంది డాక్టర్లను నియమించకపోతే భవిష్యత్తులో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గన్నవరం ఎయిర్‌పోర్ట్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ భవన ప్రహరీ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, విదేశీ ప్రతినిధులు వచ్చినప్పుడు అది మన రాష్ట్ర పరువు తీసేలా ఉందని విమర్శించారు. గత సమావేశాల్లో మంత్రి హామీ ఇచ్చినట్లుగా, వెంటనే నిధులు కేటాయించి ఆ ఆసుపత్రిని ఆధునీకరించాలని కోరారు. 2019-24 మధ్య కాలంలో పశుసంవర్ధక శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ఆ సమయంలో స్థానిక నేతలు, కొందరు అధికారులు మరియు పోలీసుల అండతో ఒంగోలు గిత్తలు, ఆవులను అక్రమంగా కలకత్తా మీదుగా బంగ్లాదేశ్‌కు తరలించారని ఆరోపించారు. లక్షలాది రూపాయల విలువైన పశువులను తక్కువ ధరకే కొనుగోలు చేసి అక్రమ రవాణాకు పాల్పడ్డారని, దీనివల్ల రాష్ట్రంలో పశుసంపద తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే చెక్ పోస్టులను బలోపేతం చేసి, పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని, వెటర్నరీ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకురావాలని యార్లగడ్డ వెంకట్రావు సభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

# ముదిగొండ మండల అభివృద్ధికి బాటలు: 33 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు మోక్షం

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి ద తీసుకెళ్లి నిధులు సాధించిన కందిమళ్ళ వీరబాబు

## తల్లంపాడు - ముదిగొండ రహదారి కష్టాలకు చెక్

## హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు, రైతులు



ముదిగొండ మండలం ఫిబ్రవరి 24 వాయిస్ టుడే: ముదిగొండ మండల పరిధిలోని రహదారుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులను మంజూరు చేసింది. మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షులు కందిమళ్ళ వీరబాబు గౌడ్ ప్రత్యేక చొరవతో, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ ప్రాంత అభివృద్ధికి రూ. 33 కోట్ల భారీ నిధులను కేటాయించారు.

**వీరబాబు కృషి - ప్రజల విజయం:**

ఎన్నో ఏళ్లుగా తల్లంపాడు - యడవల్లి - యడవల్లి లక్ష్మీపురం - ముదిగొండ మార్గంలో ప్రయాణీకులు, ముఖ్యంగా పొలాలకు వెళ్లే రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కందిమళ్ళ వీరబాబు గౌడ్, ఈ విషయాన్ని స్వయంగా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క, వెనువెంటనే నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మండల వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**అభివృద్ధి పథంలో ముదిగొండ:**

ఈ రహదారి విస్తరణతో ఖమ్మం - సూర్యాపేట జాతీయ రహదారికి (గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ద్వారా) అనుసంధానం పెరగడమే కాకుండా, మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యాలు కూడా మెరుగుపడనున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కందిమళ్ళ వీరబాబు గౌడ్ చేస్తున్న కృషిని గ్రామస్తులు కొనియాడుతున్నారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి మరియు ప్రత్యేక చొరవ చూపిన కందిమళ్ళ వీరబాబు గౌడ్ కి మండల నాయకులు, రైతులు మరియు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రజక కుటుంబంపై జరిగిన దాడికి నిరసనగా

# సర్వారం గ్రామంలో కొవ్వొత్తులతో భారీ నిరసన ర్యాలీ



హుజూర్ నగర్ ఫిబ్రవరి24 (వాయిస్ టుడే ప్రతినిధి) : నాగర్ కర్నూల్ జిల్లా మండలం కుమ్మెర శ్రీమల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవంలో రజక కుటుంబంపై దాడి చేసి 2 నెలల చిన్నారిని బలిగొన్న నిందితులను కఠినంగా శిక్షించాలని సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం సర్వారం గ్రామంలో కులమతాలకతీతంగా గ్రామ ప్రజలు భారీ కొవ్వొత్తుల నిరసన ర్యాలీని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ . చిలికేశ్వరం చంద్రకళ రజక కుటుంబం శ్రీమల్లికార్జున స్వామి దర్శనం చేసుకోవడానికి వెళ్లగా దర్శనం చేసుకోకుండా నిర్వాహకులు చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకోగా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించగా వారిపై బూతులు తిడుతూ దుర్భాషలాడుతూ అతికిరాతకంగా క్రూరంగా కొట్టి చిన్నారిని కాలుతో తన్ని చంపిన దుర్మార్గులను రాష్ట్ర ప్రభుత్వం చట్టపరంగా కఠినంగా శిక్షించాలని మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మెటుపల్లి మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్లు

మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.ఫిబ్రవరి 24 : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని సోమవారం సాయంత్రం మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి,వైస్ ఛైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ ఎన్నికల్లో మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ గా మైలారపు లింబాద్రి, వైస్ ఛైర్మన్ గా ఓంకారి నవీన్ కుమార్ గెలుపొందగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావులతో కలిసి మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతనంగా మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ ఛైర్మన్ ఓంకారి నవీన్ కుమార్లు గెలుపొందిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మెట్ పల్లి మున్సిపల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళిక అంశాలను సీఎం రేవంత్ రెడ్డితో ఈ సందర్భంగా వారు చర్చించారు. మెట్ పల్లిని ఆదర్శవంతమైన మున్సిపల్ గా తీర్చిదిద్దడానికి ముందుండి పనిచేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లికి చెందిన పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రెండవ రోజు కొనసాగిన అంగన్వాడీ రిలే దీక్షలు

కృష్ణా జిల్లా-గన్నవరం : కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అంగన్వాడీ లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ బి తాతబ్బాయి డిమాండ్ చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా గన్నవరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం రెండవ రోజు అంగన్వాడీ కార్యకర్తలు దీక్ష నిర్వహించారు. ఈ దీక్ష సందర్భంగా తాతబ్బాయి మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో 42 రోజుల నిరవధిక సమ్మె తరహాలో మరో పోరాటానికి అంగన్వాడీ లు సిద్దంగా ఉన్నారని. ప్రభుత్వ హామీ మేరకు సానుకూలంగా అంగన్వాడీ లతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. పరిష్కారం చూపకుండా తాత్సారం చేస్తే పోరాటం ఉధృత రూపం దాల్చుతుంది అని అన్నారు. ప్రాజెక్ట్ నాయకురాలు రమాదేవి మాట్లాడు తూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులతో సానుకూలంగా చర్చలు జరపి పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.



## ఉద్యోగ,ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి.

### మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి.

### మెట్ పల్లిలో యువతకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత..

మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి ఫిబ్రవరి24 : జగిత్యాల జిల్లా మెటుపల్లి పట్టణంలోని ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి,వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ అన్నారు. మెట్ పల్లి ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 22న మెటుపల్లిలో చేపట్టిన ఓపెన్ ఉద్యోగ మేళకు హాజరై ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించిన పలువురు యువతకు మంగళవారం నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెటుపల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి,వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యువతకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక యుగంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడానికి మెట్ పల్లి ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ యాసీన్,ఎండీ బిస్మిల్లా ముందుకు రావడం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో మరింత మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. కాగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మెటుపల్లి మున్సిపల్ చైర్మన్ గా మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ గా ఓంకారి నవీన్ కుమార్ లు విజయం సాధించగా మెటుపల్లి ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ యాసీన్, ఎండీ బిస్మిల్లా ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనకు కృషి చేస్తున్న సందర్భంగా యాసిన్, బిస్మిల్లాలను మెటుపల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెటుపల్లి ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ యాసీన్,ఎండీ బిస్మిల్లా,అధ్యాపకులు పులిమామిడి ప్రవీణ్ కుమార్ (ఎంఏ ఇంగ్లీష్),నాయకులు మైలారపు రాంబాబు,కోట కిరణ్ కుమార్ (ప్రముఖ సామాజిక సేవకులు),సిబ్బంది డీ.మనోహర్, బీ.రాజేందర్ బీ.అఖిల,ఎం వేణు, బీ.మాధవి,పలువురు యువత పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు పూర్తిగా కల్పించాలి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు**

**ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశంలో కీలక ఆదేశాలు**

**ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి**

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి24 : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఇంటర్‌మీడియట్ పదో తరగతి (ఎస్ ఎస్ సి) పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో మంగళవారం రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించబడింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగిత రానా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య హైదరాబాద్ నుండి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇంటర్ పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీటీవీ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను చురుకుగా పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని, చీఫ్ సూపరింటెండెంట్లు తమ బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాల బయట విద్యార్థులు, సిబ్బంది సౌకర్యార్థం క్లాస్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బి సెక్షన్ ను అమలు చేయాలని అన్నారు. పరీక్షావ కేంద్రాల వద్ద అవసరమైన కిట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, అవసరమైన ఫర్నిచర్ వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ పరీక్షలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో రేపటి నుండి నిర్వహించనున్న ఇంటర్‌మీడియట్ వార్షిక పబ్లిక్ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 25, 2026 నుండి మార్చి 18, 2026 వరకు ప్రతిరోజు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ప్రథమ ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహించబడనున్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 18,685 మంది విద్యార్థులు హాజరుకానుండగా, 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, సీసీటీవీ పర్యవేక్షణ, ప్రశ్నాపత్రాల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల రవాణా భద్రపరిచే ప్రక్రియలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు కల్పించినట్లు తెలిపారు . మార్చి 14, 2026 నుండి ఏప్రిల్ 16, 2026 వరకు నిర్వహించనున్న పదో తరగతి ( ఎస్ ఎస్ సి) పబ్లిక్ పరీక్షలకు అవసరమైన సదుపాయాల కల్పన కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సాధారణ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడనున్నాయని చెప్పారు. జిల్లాలో 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు నమోదు కాగా, మొత్తం 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణలో ప్రశ్నాపత్రాల భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయం, తాగునీరు ఇతర మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విధుల్లో పాల్గొనే అధికారులు తప్పనిసరిగా తమ ఐడీ కార్డులు ధరించి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు . సిబ్బందికి అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో కి ఫోన్ లు మరే ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు తీసుకు వెళ్లకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సమన్వయంతో, విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన, జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, జిల్లా ఇంటర్మీడేట్ అధికారి వెంకటేశ్వర్లు ,వైద్య శాఖ అధికారి తుకారాం రాతోడ్,డి పి ఓ సుధీర్, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత,రవాణా శాఖ అధికారి,టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సులోచనరాణి ,ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగిరం చేయండి

**వచ్చే నెలలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు**

**రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 2,160 ఇండ్లను ఒకే చోట నిర్మాణం**

**మార్చి మొదటి వారంలో సీఎం చేతుల మిదిగా ప్రారంభోత్సవం**

**పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక**

**రాష్ట్ర పౌరసరఫరాల మరియు**
**నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హుజూర్ నగర్ ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే ప్రతినిధి) : రాష్ట్ర చరిత్రలో ఒకే చోట 2,160 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి పేదలకు అందిస్తున్నామని పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు మంగళవారం హుజూర్ నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో 125 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్లను రాష్ట్ర హౌజింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి పరిశీలించారు .. అనంతరం మంత్రి క్యాంప్ ఆఫీస్ లోఏర్పాటు చేసిన మీడియా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2011 లో నాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హుజూర్ నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లులో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని కానీ రాష్ట్ర విభజన తర్వాత ఆనాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసి డంపింగ్ యార్డ్ మాదిరిగా మార్చిందని మండిపడ్డారు. తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల , కృషి ఆకాంక్షలతో తిరుగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం నెరవేరుతుందన్నారు. దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, 1 ప్లాట్ కు రూ. 6 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని ఒక్క ఫ్లాట్ విస్తీర్ణం 325 స్క్వేర్ ఫీట్ ఉంటుందని వివరించారు. రూ.75కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించినట్లు వెల్లడించారు. మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మొదటి విడతలో హుజూర్ నగర్ లోకల్ లో ఇండ్లు లేని వారికి, నిరుపేదలు, తెల్ల రేషన్ కార్డు కలిగిన 1000 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు. రెండవ విడతలో హుజూర్ నగర్ నియోజకవర్గంలోని పేదలకు అందించడం జరుగుతుందని ఎంపిక ప్రక్రియలో ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్ పర్సన్, తాసిల్దార్ లు పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్పీ కే నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ పోటీలు విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

**పోటీల సక్సెస్ లో మంత్రి వాకిటి శ్రీహరి గారి పాత్ర ఎనలేనిది ..**

**16 వవార్డు పరిధిలో పోటీలు నిర్వహించడం చాలా ఆనందాన్నిస్తోంది ..**

**16వ వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని ...**



మక్తల్ ఫిబ్రవరి 24 వాయిస్ టుడే ప్రతినిధి : మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు కనివిని ఎరుగని రీతిలో విజయవంతం కావడంపై స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని ధన్యవాదాలు తెలిపారు. పోటీలకు వేదిక ఆయన మినీ స్టేడియం 16 వ వార్డు పరిధిలో వస్తుందని, తన వార్డు పరిధిలో రాష్ట్రస్థాయి పోటీలను ఘనంగా నిర్వహించిన మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దీంతోపాటు పోటీల విజయవంతానికి కృషి చేసిన జిల్లా క్రీడల అధికారి ,పీఈటీలు, కోచులు, సహాయక సిబ్బంది, అన్ని శాఖల ప్రభుత్వాధికారులు, స్థానిక నాయకులు, 33 జిల్లాల నుంచి వచ్చిన 1500 మంది పైగా క్రీడాకారులకు సరైన వసతి, ఆతిథ్యం కల్పించిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు, పోటీలను మీడియా మాధ్యమాలలో ప్రసారం చేసి అందరికీ చేరువ చేసిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

**సీఎం రేవంత్ రెడ్డి,**

క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో నూతన క్రీడా పాలసీ తీసుకురావడమే కాకుండా క్రీడలకు పెద్దపీట వేసి, గ్రామీణ స్థాయి నుంచి నాణ్యమైన క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడమే భాగంగా సీఎం కప్ పోటీలు నిర్వహించారని, ఈ పోటీల నుంచి భవిష్యత్తులో ఎంతో మంది క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆశా భావం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా క్రీడలకు పెద్దపీట వేస్తున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. ఇకపై ప్రతి ఏడాది మక్తల్ లో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహించేలా మంత్రి వాకిటి శ్రీహరి నిర్ణయం తీసుకోవడం ఈ ప్రాంత వాసులకు మరింత ఆనందాన్ని కలిగిస్తుందని, దీంతోపాటు మక్తల్ ప్రాంతం క్రీడా పరంగా, వాణిజ్యపరంగా, పర్యాటకపరంగా మరింత అభివృద్ధి చెందేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు. సీఎం కప్ పోటీల విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు చెబుతున్నట్లు 16వ.వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని తెలిపారు. భవిష్యత్తులో సైతం ఇదే తరహా లో క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.



## మెటుపల్లి.స్టడీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి సానుకూలత

మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.ఫిబ్రవరి 24: జగిత్యాల జిల్లా మెటుపల్లి పట్టణంలోని మూడవ వార్డులో విద్యార్థుల సౌకర్యార్థం స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలన్న వినతిపై రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. మంగళవారం మూడవ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేష్, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు ఆదేశాల మేరకు మంత్రిని కలిసి వార్డులో స్టడీ సెంటర్ అవశ్యకతను వివరించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుపేద విద్యార్థులకు, యువతకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కౌన్సిలర్ విజ్ఞప్తిపై మంత్రి తక్షణమే స్పందించారు. అక్కడికక్కడే ఆర్‌డీవో (RDO) తో ఫోన్లో మాట్లాడి,స్టడీ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి తగిన స్థలాన్ని పరిశీలించి,అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి త్వరితగతిన స్పందించడం పట్ల స్థానిక విద్యార్థులు,యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌తో పాటు రాజ్యాంగ రక్షక దళ్ అధ్యక్షులు రేంజర్ల రాజేష్, సోమిడి సృజన్ ముతునూరి సురేష్,నరేష్, ఆనంద్,శివ,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



## దమ్ముంటే రాజీనామా చెయ్.. మీనా సుఖేందర్ గౌడ్ నీ దొంగ నాటకాలు మానుకో.. కాంగ్రెస్ కి ఎంత తమ్ముడు పోయినావు...

మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.ఫిబ్రవరి 24 : జగిత్యాల జిల్లా మెటుపల్లి పట్టణంలోనీ బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు మాట్లాడుతూ... అరవింద్ అన్న మీద విమర్శించే విమర్శించే స్థాయి నీది కాదు.. తనను అనే పెద్దోదీవి అయితావ్ అనుకుంటే భూస్థాయి పీతం అవుతావు.. బిజెపి కౌన్సిలర్ గా రాజీనామా చేసి.. తిరిగి పోటీ చేసి చూపించు... కాంగ్రెస్ కోలేక,ఇండిపెండెంట్ గాను గెలిచి చూపించు అప్పుడు ఆర్ఎస్ఎస్ బిజెపి నాయకులు.. ఎంపీ అరవింద్ పై కౌన్సిలర్ మీనా సుఖేందర్ గౌడ్ చేసిన ఆరోపణలపై బీజేపీ నేతలు మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసిన మీ కుటుంబం అని చెప్తున్నావ్ మీ నాన్నగారి నుండి చేసినాను చెప్పినవ్.. కాంగ్రెస్ కి అమ్ముడుపోయి కోవర్టుగా మారినావు నువ్వు కాదా.. నీ స్థాయి ఏమని మాట్లాడుతున్నావు.. కోరుట్ల నియోజకవర్గ బిజెపి కార్యకర్తల అనేక మంది జీవితాలతో ఆడుకుంటున్నావు నువ్వు, ఎంపీ అరవింద్ గారిని విమర్శించడం సరికాదు. మున్సిపల్ చైర్మన్ పదవి రాలేదని పార్టీకి ద్రోహం చేసింది. నువ్వు కదా.. కాంగ్రెస్ కి ఎంత కు అమ్ముడు పోయినావు నువ్వు.. ఒకవేళ అమ్ముడు పోకపోతే కాశి బాగ్ టెంపుల్ కి రా ప్రమాణం చెయ్ నువ్వు డబ్బులు తీసుకున్నది. వాస్తవమా కాదా మేము బిజెపి కార్యకర్తలు అందరూ వస్తాం. దీనికి రెడీనా నువ్వు బాబాయ్. బిజెపి కార్యకర్తలు మాట్లాడుతున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు,మల్లాపూర్ ఇబ్రహీంపట్నం అధ్యక్షులు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు..

## పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

**::: ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి**



హుజూర్ నగర్ ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే ప్రతినిధి) : హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నేడు బుధవారం అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమం లో భాగంగా జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశాల మేరకు హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని లైసెన్స్ డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ బాబు తెలిపారు. మంగళవారం టౌన్ హాల్ లో కంటి వైద్యశిబిరం ఏర్పాట్లను కోదాడ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ చరమంద రాజు లు పరిశించారు. అనంతరం వారు మాట్లాడుతూ...సర్కిల్ పరిధిలోని సిమెంట్ పరిశ్రమల ట్రాన్స్ పోర్ట్, లారీ అసోసియేషన్, ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్, క్యాబ్ డ్రైవర్లు కు ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన సీనియర్ కంటి వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమగు వారికి ఉచితంగా మందులు కళ్ళ అద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.



## పాఠశాలకు ప్రహారీ గోడ పనుల ప్రారంభం

**::: ప్యాలవరం. సర్పంచ్ నర్మదరాణి. రాజ్ కుమార్**

వాయిస్ టుడే ఝరాసంగం. ఫిబ్రవరి, 24 ఝరాసంగం మండల కేంద్రమైన. ప్యాలవరం.గ్రామ ప్రాథమిక పాఠశాలలో ప్రహారీ గోడ నిర్మాణ పనులు.మంగళవారం.ప్యాలవరం ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ నర్మద రాణి రాజ్ కుమార్ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆమె..మాట్లాడుతూ విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రహారీ గోడ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, శిరోమణి, నర్సింలు, బాలబాలప్ప తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసిన గునుకుల కొండాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం

### గ్రామాభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ వినతి

తిమ్మాపూర్,ఫిబ్రవరి 25(వాయిస్ టుడే):మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణను నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో గునుకుల కొండాపూర్ గ్రామ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ,పాలక వర్గం సభ్యులు కలిసి గ్రామ అభివృద్ధి కోసం నిధులు కావాలని వినతి పత్రంసమర్పించారు. గ్రామపంచాయతీ భవనం,సిసి రోడ్లు, రజక కమ్యూనిటీహాల్,జిమ్ సెంటర్, క్రీడా ప్రాంగణం తదితర అంశములపై ఎమ్మెల్యేతో చర్చించారు.ఎమ్మెల్యే తప్పకుండా గ్రామ అభివృద్ధికి తగిన సహకారం అందిస్తానని ఈ మేరకు హామీ ఇచ్చారు.ఎస్సీ కాలనీ అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.గ్రామ అభివృద్ధి కోసం తగిన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేకి గ్రామ ప్రజల పక్షాన పాలకవర్గ సభ్యుల పక్షాన సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ ధన్యవాదాలు తెలియజేశారు.



# సమాజసేవలో జర్నలిస్టుల పాత్ర చాలా గొప్పది

### కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
### టిడబ్ల్యూజేఎఫ్ డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



కరీంనగర్,ఫిబ్రవరి 25(వాయిస్ టుడే):సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)2026 డైరీ ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారదిగా ఉన్న జర్నలిస్టుల పాత్ర గొప్పదని అన్నారు.జర్నలిస్టుల డైరీని తన చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరు భాద్యతగా ఉండాలని అందులో తానుకూడా ముందు వరుసలో ఉంటానని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం,పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్ లకు టిడబ్ల్యూజేఎఫ్ డైరీ ని ఫెడరేషన్ నాయకులు అందజేశారు.ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టిడబ్ల్యూజెఎఫ్ ముందుంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పిఎస్ రవీంద్ర,జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్ రావు,జిల్లా సహాయ కార్యదర్శి కిరణ్,జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్ రెడ్డి,దీక్షిత్ పాల్గొన్నారు.

# క్రీడాకారిణులను సన్మానించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 25 (వాయిస్ టుడే): రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో ప్రతిభకనబర్చిన తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు మాన కొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సన్మానించారు. ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో సీఎం కప్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు శాలువాలు కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ,అంతర్జాతీయ వేదికలపై మన క్రీడాకారులు రాణించాలన్నారు. పతకాలు సాధిస్తూ మన కీర్తిని ఖండాంతరాలు దాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో మహాత్మానగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్,ఉప సర్పంచ్ కేతిరెడ్డి లింగారెడ్డి,హైస్కూల్ విద్యార్థినులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సీనియర్ మహిళా కాంగ్రెస్ నేతలకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

కరీంనగర్,ఫిబ్రవరి 24(వాయిస్ టుడే):కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రధానంగా బూతు స్థాయి నుండి మహిళా కాంగ్రెస్ ను బలోపేతం చేయడంతో పాటు 10 ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో నాటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ సీనియర్ మహిళా నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో భాగంగా కర్ర సత్యప్రసన్న రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి మహిళా కాంగ్రెస్ ను బలోపేతం చేయాలని రాబోయే జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి దశాబ్దాలుగా కష్ట పడ్డ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరుతూ మహిళా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కరీంనగర్ జిల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా మహిళా కాంగ్రెస్ లో కష్ట పడ్డ మహిళలకు అవకాశాలు దక్కే విధంగా ప్రయత్నం చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ ,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గాజుల సుకన్య ,రాష్ట మహిళ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ




జ్యోతి రెడ్డి నగర అధ్యక్షురాలు వెన్నం రజిత రెడ్డి , కరీంనగర్ జిల్లా మహిళా బ్లాక్ మండల పట్టణ అధ్యక్షులు, కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ మహిళా అధ్యక్షులు,మహిళా నాయకులు పాల్గొన్నారు.



### అక్రమ ఇసుక రవాణా వాహనాల పట్టివేత

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 24(వాయిస్ టుడే):ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజిలెన్స్ ఇన్స్పెక్టర్ సిబ్బంది యుక్తంగా మొగ్దుంపూర్ గ్రామంలోని రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ చేస్తుండగా సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బుక్య సంపత్,మడికంటి మారుతి, అలవేణి సంతోష్,ఎలవేణి శ్రీధర్,దూస సందీప్,కరీంనగర్ లోని కిసాన్ నగర్ కు చెందిన నీరుకుల్లా అనిల్,గండికోట సంపత్, అల్తాఫ్ ఎటువంటి అనుమతులు లేకుండా తమ ట్రాక్టర్ల నందు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకున్నామని ఇన్స్పెక్టర్ రవీందర్ కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఐ ఏ నిరంజన్ రెడ్డి అట్టి నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.ఈ సందర్భంగా సిఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, కావున ట్రాక్టర్ యజమానులు అక్రమ ఇసుక రవాణా చేయకూడదని హెచ్చరించారు.



### ఇందిరమ్మ ఇళ్లతో కొత్త వెలుగులు
### ::: మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 24(వాయిస్ టుడే): ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలతో పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు తొంగిచూస్తాయని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో జరిగిన తమ్మనవేణి మల్లమ్మ,పుట్ట స్వరూప, పుల్లీ బేగం ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎంతో కాలంగా నిరుపేదలు సొంతింటి కల కోసం ఎదురు చూస్తున్నారని, ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం వారి కలను సాకారం చేస్తున్నదన్నారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో నిరుపేదల ఆత్మగౌరవాన్ని ప్రభుత్వం పెంచిందన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.తొలి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తికావస్తున్నాయని, పూర్తయిన ఇళ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని చెప్పారు.ఇళ్ల నిర్మాణ పనులు వేగం పెంచుతున్నామన్నారు.ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత నవాబ్ ఇబ్రహీం షేక్,తిమ్మాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్హోత్రా,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్,పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి,గోగూరి నర్సింహారెడ్డి,సిరిగినేని కొండల్ రావు, బుధారపు శ్రీనివాస్,కొత్త తిరుపతిరెడ్డి,వార్డు మెంబర్లు నూనె సురేష్,దాడి మొండయ్య, టి.స్వరూప,ఆవుల నర్సయ్య,నిసర్, తాజొద్దీన్ పాల్గొన్నారు.



### అందోల్ జోగిపేట మున్సిపల్ లో
## 4 కొత్త మహిళా బిల్డింగ్ భవనాలు

#### ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో శంకుస్థాపన
#### మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి వైస్ చైర్మన్ చిట్టిబాబు

వాయిస్ టుడే సంగారెడ్డి జిల్లా ప్రతినిధి : అందోల్ జోగిపేట మున్సిపల్ పట్టణంలోని మహిళా సంఘాల గ్రూప్ సభ్యులకు సమావేశాలు జరుపుకునేందుకు మున్సిపల్ లో నాలుగు మహిళ సమాఖ్య భవనాల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి అన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో త్వరలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయిస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా, అందోల్ జోగిపేట మహిళా సమాఖ్య సభ్యుల ఆధ్వర్యంలో చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు కు వారు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. జరిగిన సమావేశంలో మహిళా సభ్యులు కోరిక మేరకు భవనాల నిర్మాణకి కృషి చేస్తానన్నారు. సమావేశంలో మెప్మా టిఎంసి బిక్షపతిగౌడ్, మున్సిపల్ సమైక్య మహిళా సభ్యులు పాల్గొన్నారు.



### రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా ఫిబ్రవరి–24 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మొక్కులు సమర్పించిన ఎమ్మెల్యే విజయ రమణారావు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి గుడి నిర్మాణం చేసిన గౌడ కులస్తులకు అభినందనలు తెలుపుతూ ఎల్లమ్మ తల్లి అనుగ్రహం గౌడ కులస్థులకు, గ్రామ ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని, త్వరలోనే గుడి ప్రహరీ గోడకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. నారాయణపూర్ మాజీ ఎంపిటిసి మండల రమేష్, కొండల్ రావు, మాధవరావు, గౌడ కుల పెద్దలు బుర్ర బాణయ్య, బాలసాని శ్రీనివాస్, మూల హరీష్, బాలసాని సురేష్, మారేడు గొండ సధి,పడాల శంకర్, వెగోళపు మల్లికార్జున్, తాళ్లపల్లి రాజు, పొన్నం రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్ రావు, ఎలిగేటి సధి,ఆకుల నగేష్, కల్లెపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు..




### శాస్త్రీయ పద్ధతులతోనే చెరకులో అధిక దిగుబడి

వాయిస్ టుడే, ఝరాసంగం (ఫిబ్రవరి 24): జహీరాబాద్ కృషి విజ్ఞాన కేంద్రంలో చెరకు సాగు మరియు ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బసంత్‌పూర్ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొని రైతులకు దిశానిర్దేశం చేశారు.

ప్రధాన అంశాలు: భూసార పరీక్షలు: రైతులు తమ భూమి స్వభావాన్ని బట్టి, భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులను వాడాలని ఆయన సూచించారు.

నానో టెక్నాలజీ: నానో యూరియా మరియు నానో DAP వాడకం వల్ల సాగు పెట్టుబడి తగ్గడమే కాకుండా, పంట దిగుబడి పెరుగుతుందని వివరించారు.

శాస్త్రీయ సాగు: సంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి, శాస్త్రీయ సాగు విధానాలు పాటిస్తే చెరకు రైతులు అధిక లాభాలు పొందవచ్చని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



### రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో హద్నూర్ కానిస్టేబుల్‌కు కాంస్య పతకం.

వాయిస్ టుడే ఝరాసంగం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండల్ సైబరాబాద్ వేదికగా ఇటీవల నిర్వహించిన 4వ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీలలో సంగారెడ్డి జిల్లా చెందిన పోలీస్ కానిస్టేబుల్ ప్రతిభ చాటారు.హద్నూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లకవత్ రవి కుమార్ (గ్రాజ 3321) రెజ్లింగ్ పోటీలలో పాల్గొని అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీలలో ఆయన కాంస్య పతకాన్ని సాధించి జిల్లా పోలీసు యంత్రాంగానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పతక విజేత. లకవత్ రవి కుమార్ ఉన్నతాధికారులు,తోటి సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో ఉంటూనే క్రీడలో కష్టపడి పతకం సాధించడం అభినందనీయమని వారు కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నంత స్థాయి చేరాలని అభినందించారు. కార్యక్రమంలో హదూన్నర్.ఎస్ఐ. సుజిత్. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ఈదురు గాలులతో నేలకొరిగిన మక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: చెల్పూరి రాము

ఇల్లందకుంట ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే): మంగళవారం రోజున ఇల్లంతకుంట మండలం ఇల్లంతకుంట, బూజునూరు, చిన్న కోమటిపల్లి, సిరిసేడు, టేకుర్తి గ్రామాలలో ఈదురు గాలులతో నేలకొరిగిన మక్కజొన్న పంటలను తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ఇల్లంతకుంటలో సోమవారం సాయంత్రం విపరీతమైన ఈదురు గాలుల వీయడం వల్ల సుమారు 350 ఎకరాల వరకు మక్కజొన్న పంట నేలకొరిగింది. యాసంగి పంట వేసుకున్న మక్కజొన్న పిసు దశ వచ్చేసరికి మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు ఈదురుగాలుల వల్ల మక్కజొన్న పంట నేలకొరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వ్యవసాయ శాఖ ద్వారా సమాచారం తెలుసుకొని నెలకొరిగిన మొక్కజొన్న పంటలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకి ప్రభుత్వం నుండి ఎకరానికి 50 వేల రూపాయల నష్టపరిహారం ఇప్పించాలని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఈదురు గాలులతో వేల ఎకరాల పంట పొలాలు నష్టపోవడం వలన రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం అనావృష్టి వలన నష్టపోయిన పంట పొలాలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమమే ధ్యేయంగా చెప్పుకుంటూ అనేక హామీలు ఇస్తున్నారని కానీ ఆచరణలో రైతును ఆదుకునే పరిస్థితి లేదన్నారు ప్రతి సంవత్సరం బడ్జెట్లో అకాల వర్షాలకు నష్టపోయిన పంట పొలాలకు ప్రత్యేక



బడ్జెట్ కేటాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఫసల్ బీమా చేయాలని డిమాండ్ చేశారు లేనియెడల పంట పొలాలు నష్టపోయిన రైతులందరి తో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కమిటీ సభ్యులు చింతల కౌశిక్, వెంకట్రాజ్యం, లచ్చయ్య, వెంకటయ్య, పాల్గొన్నారు.

# పేదల గుడిసెల కూల్చివేత అమానుషం : మాజీ ఎంపీ నామ

ఖమ్మం ఫిబ్రవరి 24 ( వాయిస్ టుడే ) : ఖమ్మం నగర కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల భూదాన్ భూములల్లో నివసిస్తున్న వందలాది పేదల గుడిసెలను కూల్చివేయడం అత్యంత దురదృష్టకరమని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఆక్షేపించారు. ఏళ్ల తరబడి అక్కడ నివసిస్తూ జీవనోపాధి సాగిస్తున్న పేద కుటుంబాలకు ముందస్తు గా ప్రత్యామ్నాయ నివాసం కల్పించకుండా గుడిసెలను కూల్చివేసి వారిని రోడ్డున పడవేయడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని నామ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పులు చేసి, చెమటోడ్చి కట్టుకున్న పేదల ఇళ్లను క్షణాల్లో నేలమట్టం చేయ డం పేదల గుండెలను పగలగొట్టే చర్య అని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ కూల్చివేత సమయంలో మీడియాను కూడా రానివ్వకుండా అడ్డుకోవడం, పారదర్శకత లేకుండా చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. పేదలపై ఇలాంటి కఠిన చర్యలు తీసుకోవడం సరైంది కాదని, ప్రభుత్వానికి బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. భూదాన్ భూములల్లో నివసిస్తున్న వారి వివరాలు సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు లేదా స్థలం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పేద ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ నిలబడతుందని, వారి హక్కుల కోస ం పోరాడతామని నామ స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలో అభివృద్ధి అవసరం ఉన్నప్పటికీ, అది పేదల జీవితాలను ఛిన్నాభిన్నం చేసేలా ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# పేదల గుడిసెలు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?



### ::: ఎంపీ రవిచంద్ర

ఖమ్మం, ఫిబ్రవరి, 24 ( వాయిస్ టుడే ) : ఖమ్మం నగర శివారులోని భూదాన్ భూముల్లో పదేళ్లుగా నివాసం ఉంటున్న పేదల గుడిసెలను కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా కూల్చి వేయడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండిచారు. అక్కడ నివాసముంటున్న సుమారు 600 పేద కుటుంబాలపై వందలాది మంది పోలీసులు, పదుల సంఖ్యలో జేసీబీలు, ట్రాక్టర్లతో తెల్లవారు జామున్నే దాడి చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదే పదే ఇందిరమ్మ రాజ్యం అని ప్రగల్భాలు పలికే కాంగ్రెస్ నేతలు.. పేదల ఇల్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ, న్యాయపరంగా పోరాడుతున్న పేదలపై ప్రభుత్వం దుర్మార్గంగా విరుచుకుపడటం ద్వారా కాంగ్రెస్ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని మండిపడ్డారు. గుడిసెల తొలగింపును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, బాధితులకు అండగా ఉంటామని ఎంపీ రవిచంద్ర హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలపై నిజంగా సానుభూతి ఉంటే తక్షణమే అక్కడి అర్హులైన పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలని వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు.

## ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలపై దిశానిర్దేశం చేసిన సిఎస్



ఖమ్మం, ఫిబ్రవరి- 24 ( వాయిస్ టుడే ) : ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను రాష్ట్రంలో పకడ్బందీగా నిర్వహించాలని సి.ఎస్. కే రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సీఎస్, అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ కె. రామకృష్ణ రావు మాట్లాడుతూ, పరీక్షలు ఎటువంటి రిమార్కులు లేకుండా, సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్షా కేంద్రాలకు ఎవరికీ సెల్ ఫోన్ తీసుకుని రావడానికి అనుమతి లేదని, సీసీ కెమెరాల సమక్షంలోనే ప్రశ్నాపత్రాలు సీల్ ఓపెన్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రవేశ ద్వారం వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్ లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, అధికారులతో మాట్లాడుతూ, పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణా బందోబస్తు తో పటిష్టంగా చేపట్టాలన్నారు. సిబ్బందికి కావాల్సిన అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల రవాణాకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహాయించి, ఏ ఒక్కరికి మొబైల్ ఫోన్ పరీక్షా కేంద్రాల లోకి అనుమతించవద్దని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలాక్ట్రానిక్ పరికరాలు, వాచ్ లకు అనుమతి లేదన్నారు. పరీక్షకు గంట ముందు వాష్ రూం లు సానిటేషన్ చేపట్టి, క్షున్నంగా తనిఖీలు చేసి, ఎటువంటి అనుమానిత వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. త్రాగునీటి సరఫరా ఉండాలని, అంతరాయంలేని విద్యుత్ అందించాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు సరిపడ బెంచీలు, ఫర్నీచర్ ఉండాలని, కనీస సౌకర్యాల కల్పన చేయాలని కలెక్టర్ తెలిపారు.



## జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

నేలకొండపల్లి, ఫిబ్రవరి 24 ( వాయిస్ టుడే ) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల నేలకొండపల్లి భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సు బ్రోచర్ను కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ డిఎస్ఆర్.రాజేందర్ సింగ్ మరియు ప్రొఫెసర్ పి. బాలభాస్కర్ లు మంగళవారం హైదరాబాద్, నాంపల్లి లోని కళాశాల విద్య కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ జాతీయ సదస్సు " ఎకోస్ ఆఫ్ ది పాస్ట్, బీమ్స్ ఆఫ్ లైట్: ఎక్స్ ప్లోరింగ్ ది సైంటిఫిక్ పినామినా బిహైండ్ తెలంగాణ ఆర్కిటెక్చర్" అనే అంశంపై మార్చి 6,7 తేదీల్లో జరగనుంది. ఈ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలాయాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన డెలిగేట్స్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతిని మరియు ఈ సదస్సు కన్వీనర్ డాక్టర్ నర్సింగు శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్య అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ వి. రాజేంద్ర ప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నిందితుడు అరెస్ట్



సత్తుపల్లి, ఫిబ్రవరి 24 ( వాయిస్ టుడే ) : 547 కోట్ల సైబర్ నేరాల దోపిడీ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన కీలక నిందితుడు ఉడతనేని వికాస్ చౌదరి తో పాటు మరో 13 మందిని సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. క్షేత్రస్థాయిలో కేసు విచారణ కొనసాగుతుందని మంగళవారం సత్తుపల్లి ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో చెప్పారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తే సహించేది లేదు

### ::: చట్టపరమైన చర్యలు తప్పవు - వీణవంక ఎస్ ఐ

వీణవంక ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే): మంగళ వారం రోజున ఉదయం అందజ 5:30 గంటల సమయంలో కొండపాక గ్రామ శివారులో అక్రమంగా ఇసుక ను తరలిస్తున్న ట్రాక్టర్లను,1.డ్రైవర్ అయిన రాచర్ల సాగర్ ం/శీ కొమురయ్య గ్రామం కొండపాక మరియు ఇట్టి ట్రాక్టర్ ఓనర్ మీరల హరీష్ గ్రామం కొండపాక లను, 2.డ్రైవర్ అయిన ఎల్కపల్లి రాకేష్ ం/శీ శ్రీను గ్రామం కొండపాక మరియు ఇట్టి ట్రాక్టర్ ఓనర్ కోలుగురి బుజ్జమ్మ గ్రామం కొండపాక,3.ట్రాక్టర్ ఓనర్ కోలుగురి రఘు ం/శీ పోచయ్య గ్రామం కొండపాక లను పట్టుకొని కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు వీణవంక ఎస్ ఐ.

### ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మోటారు వాహనాల డ్రైవర్ లు వినియోగించుకోవాలి: పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్



జమ్మికుంట ఫిబ్రవరి 24 (వాయిస్ టుడే): మోటారు వాహనాల డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు జమ్మికుంట టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. జమ్మికుంట పట్టణంలోని వినాయక ఫంక్షన్ హాల్లో ఉదయం 11 గంటలకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో హెవీ గూడ్స్ వాహన డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవచ్చు అని, పరీక్షల్లో అర్హులుగా తేలిన వారికి ఉచిత కళ్లజోడులు కమిషనర్ చేతుల మీదుగా పంపిణీ చేయబడతాయి అని తెలియజేశారు. డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. డ్రైవర్ల ఆరోగ్య భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.



## అక్రమంగా మట్టి తరలిస్తున్న జెసిబి ట్రాక్టర్లు పట్టివేత ఎస్సై రమాకాంత్

### మండలంలో అనుమతులు లేకుండా ఇసుక మట్టి తలిస్తే కఠిన చర్యలు

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఫిబ్రవరి 24 : మంగళవారం రోజు తెల్లవారుజామున బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రన్న సమాచారంతో చేరుకొని జెసిబి, రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. మండలంలో అక్రమంగా మట్టి ఇసుక తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.





## ఉచిత సంతాన సాఫల్య శిబిరం

దంతాలపల్లి ఫిబ్రవరి24(వాయిస్ టుడే):- వర్ధన్నపేట మండల కేంద్రంలోని పిల్లలు లేని దంపతులకు డా,,రవీందర్ రెడ్డి మెమోరియల్ వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఐవిఎఫ్ యాక్సిస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 27 వ తేదీన ఉచిత క్యాంపు కలదఅని క్యాంప్ ఎగ్జిక్యూటివ్ వంగాల అనిల్ మంగళవారం నాడు దంతాలపల్లి మండల కేంద్రంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కన్సల్టేషన్, 3డి స్కానింగ్,వైరల్ మార్కర్స్,సెమెన్ అనాలసిస్ మరియు వీటితో పాటు మీకు ఏమైనా నీటి బుడగలు, హార్మోనల్ (థైరాయిడ్) సంబంధిత మరియు ఇతర ఏ సమస్యలు ఉన్న వైద్యం చేయుటకు సదుపాయాలు కలవని తెలిపారు. కావలిసిన వారు 9900943918 నెంబర్ ను సంప్రదించొచ్చని చెప్పారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మనసేత్రం
బుధవారం, ఫిబ్రవరి 25, 2026

# విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం: లక్ష్మీనగర్ కాలనీలో 3 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కొలన్ హన్మంత్ రెడ్డికు కాలనీవాసుల కృతజ్ఞతలు

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 24(వాయిస్ టుడే ) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ 60 గజాల కాలనీలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండడంతో గత నెల కాలనీ వాసులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంప్రదించారు. ఈ విషయంపై హన్మంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులు ఏ.ఈ మరియు డి.ఈ మాట్లాడి కాలనీ ఫేజ్1లో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ , ఫేజ్2లో ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా బౌరంపేట్ కాలనీ వాసులు బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లికుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి షాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం హన్మంతన్న మాట్లాడుతూ, “కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంది. ప్రజల అవసరాలు మా ప్రాధాన్యం. ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తాం” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కె. యాదయ్య, నారాయణ, ఎన్. రమణ, శ్రీనివాస్, రాఘవేంద్ర, కె. మల్లేష్, డి. నాగేశ్వర్ రావు, ఉపేందర్ రెడ్డి, కిషోర్, కృష్ణ, ప్రసాద్ నాయక్, సాంబశివ రావు, ఎం. శ్రీను, ఎండీ. రషీద్, కె. జీవన్ రెడ్డి, డి. లక్ష్మణ్, దుర్గ ప్రసాద్, రేణుక, సిసిందెర్ రెడ్డి, నాగశేషు, దుర్గరావు, తిరుపతి రెడ్డి, కృష్ణ, హనుమాన్, సత్యనారాయణ,



మహేష్, డిలేశ్వర్ రావు, రమణ నాయక్, ఎం. ప్రమిల, భారతి, రాణి, భాగ్యలక్ష్మి, ఎస్తరమ్మ, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ..

జూబ్లీహిల్స్ 24ఫిబ్రవరి (వాయిస్ టుడే) పరిధిలోని షేక్ పేట్ భీష్మ భవన్ లో అర్హులైన లబ్ధిదారులకు లికళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్.. 71 మంది లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులు తమ చేతుల మీదగా లబ్ధిదారులకు అందించారు ఈ కార్యక్రమంలో షేక్పేట్ ఎమ్మార్వో అనిత రెడ్డి..

**టిపిసిసి ఫోక్ పర్సన్ నిజాం ఉద్దీన్..**

షేక్పేట్ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ... బాలకృష్ణ.. ప్రీతి..జూబ్లీహిల్స్ మహిళా అధ్యక్షురాలు జ్యోతి...పూస బాబు రావు.. శేఖర్.రమేష్...అనిత.. ఉమర్ ఖాన్.. మాకబుల్ అహ్మద్..రాయల్.. లడ్డు ప్రభాకర్..లడ్డు లక్ష్మణ్..కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# జగన్మోహిని అవతారంలో యాదాద్రీశుడు



వాయిస్ టుడే/యాదగిరిగుట్ట : తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కనులవిందుగా కొనసాగుతున్నాయి... ప్రతిరోజు ఉదయం రాత్రి స్వామి అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి వాహన సేవలపై ఊరేగిస్తున్నారు.... ఏడవరోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు జగన్మోహిని అవతారంలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు, లోక కళ్యాణంకోసం ఈ జగత్ ను కాపాడడానికి స్వామివారు జగన్మోహినిగా అవతరించి సమస్త ప్రజానీకానికి కీడు తలపెట్టే వారిని అంతమొందించేందుకు ఈ భువిపై జగన్మోహిని అవతారం దాల్చాడని ప్రధాన అర్చకుడు సెలవిచ్చాడు, జగన్మోహిని అవతారంలో స్వామివారిని వజ్రవైడూర్యాలు, వివిధ రకాల పుష్పాలతో నయనమనోహరంగా అలంకరించారు అర్చకులు, వేద పండితులు వేదమంత్రాలు, వేదపారాయణ లు మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.స్వామి వారి సేవ వద్ద అర్చకులు జగన్మోహిని అవతార విశిష్టతను తెలియజేశారు.....

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్‌లకు ఘన సన్మానం

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. (వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి పట్టణం లోని స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో శ్రీదేవి ఉత్సవ కమిటీ, భువనగిరి కిరాణం & జనరల్ మర్చేంట్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తశీగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ కి, వార్డ్ కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్ కి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీవానికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వార్డులో గల సమస్యలు పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్.. మున్సిపల్ చైర్మన్ ను కోరడంతో.. అందుకు మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ లు స్పందిస్తూ మీ వార్డులో ఎలాంటి సమస్యలున్న వెంటనే పరిష్కరించేందుకు తాము కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మర్చేంట్ కమిటీ సభ్యులు పాల్గోన్నారు.



# ప్రభుత్వ స్థలాలు అక్రమార్కులు..ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

## భువనగిరి మునిసిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో..(వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టారీత్యా చర్యలు తప్పవని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్లు తెలిపారు. ఇందులో భాగంగా భువనగిరి పట్టణశీ లోని స్థానిక ఇండోర్ స్టేడియంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అధికార పార్టీ ఆధ్వర్యంలో కాపాడుకుని ప్రజా అవసరాల కోసం వాడుకుంటామని, ప్రభుత్వ భూమి ని ఎవరైనా అక్రమంగా కబ్జా చేస్తే.. ఎంతటి వారైనా సరే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ లు హెచ్చరించారు. హుస్సేనాబాద్ శివారు సర్వేనెంబర్ .157 ప్రభుత్వ భూమి ఇండోర్ స్టేడియంను అభివృద్ధి చేస్తామని, ఇండోర్ స్టేడియం కు కేటాయించిన స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణములను అధికారులు తొలగించారు. ఇట్టి స్థలంలో మరల ఎవరైనా ఆక్రమించుటకు ప్రయత్నించినవో వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని,ఇండోర్ స్టేడియం స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం గురించి జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ అధికారితో మాట్లాడి ఇండోర్ స్టేడియం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి



శ్రీవాణి రవికుమార్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో భువనగిరి తాసిల్దార్ అంజిరెడ్డి, మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి, వార్డ్ కౌన్సిలర్ కర్ణాకర్ హిరకర్ శ్రీను అధికారులు వార్డ్ ప్రజలు పాల్గోన్నారు.

## భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ను శాలువాతో సన్మానించిన పిన్నింటి స్టాన్లీ సరోజనా రెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ గా ఎన్నుకోబడిన తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ని, సుహృద్భావులు కుంభం కీర్తి రెడ్డి ని ఘనంగా సన్మాణించిన ప్రముఖ పాస్టర్ పిన్నింటి స్టాన్లీ సరోజనా రెడ్డి లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సామాజిక సమానత్వం,సామాజిక సమతుల్యత, సామాజిక న్యాయం సామాజిక స్పృహ కలిగి ప్రజల హృదయాలలో ఎప్పటికి నిలిచి పోయేవిదంగా నిస్వార్థశీగా మంచి పాలన అందించాలని, మీ పాలనలో ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు రాకూడదని ఆ దేవుణ్ణి కోరే విదంగా ఆశభావం వ్యక్తం చేశారు.

## శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఎదుర్కోలు మహోత్సవం



వాయిస్ టుడే/యాదగిరిగుట్ట అఖిల భారత పద్మశాలి సత్రం యాదగిరిగుట్ట ఆద్వర్యంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి వారి ఎదుర్కొలు మహోత్సవం సందర్భంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు పద్మశాలి సత్రం నుండి దేవస్తానం కి విచ్చేసి స్వామివారికి పట్టు వస్త్రాలను రకరకాల పువ్వులు పండ్లతో ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి స్వామి వారి సమక్షంలో ఆలయ అధికారులకు అందజేశారు, పద్మశాలి నేతన్నలు పద్మశాలి కులస్తులు సంఘము సభ్యులు అందరూ కలిసి స్వామివారికి పట్టు పంచ వస్త్రములు అందజేయడం జరిగింది అమ్మవారికి చేనేత పట్టుచీర. అందజేయడం జరుగుతుంది స్వామివారికి భజన చేసుకుంటూ ఆనందంగా పాల్గొనడం జరిగింది. ఇందులో కత్తుల సుదర్శన్ దీకొండ జోగయ్య చిక్క దేవదాస్ రచ్చ శ్రీనివాస్ పాశికంటి నాగమూర్తి పులుగం భిక్షపతి గుజ్జ నిర్మల పద్మశాలి సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పలు ఆహ్వానాలను మరియు వివిధ సమస్యలపై వినతి పత్రాలను అందజేసిన నియోజకవర్గం నాయకులు, ప్రజలు

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 24(వాయిస్‌టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లోని నివాసంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజలు పలు ఆహ్వానాలను అందజేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానాలను స్వీకరించారు అనంతరం వారు శాలువాతో సన్మానించారు. అదేవిధంగా వివిధ సమస్యలను తెలపడానికి వచ్చిన వివిధ కాలనీ వాసులు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాలు మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



## సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం- నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 24(వాయిస్ టుడే ) : నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 280 డివిజన్ జగద్గిరిగుట్ట వాసులు శ్రీమతి రామోజు లక్ష్మి గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నది చికిత్సకి సరిపడ్డ డబ్బులు లేక కుత్బుల్లాపూర్ లినియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంప్రదించక వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,00,000/- ల సీఎం సహాయనిధి - ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 2,00,000/- (రెండు లక్షల రూపాయలు ) సీఎంర్ఫ్ - లోక్ మంజూరి పత్రాలను అనంత్ చారి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, ఎల్లయ్య మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## మార్చి 10న జరిగే దరువు జాతరను విజయవంతం చేయండి : మందకృష్ణ మాదిగ

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి24(వాయిస్ టుడే ) : సామాజిక ఉద్యమాలలో దరువు పాత్ర వెలకట్ట లేనిదని, దండోరా ఉద్యమంలో సైతం దరువు పాత్ర గొప్పదని మందకృష్ణ మాదిగ అన్నారు. దరువు కళాబృందం ఏర్పడి 25 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా మార్చి 10న రవీంద్ర భారత హైదరాబాదులో జరిగే రథతోత్సవ వేడుకల గోడప్రతిని ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దరువు కళాబృందం వ్యవస్థాపకులు దరువు ఎల్లన్న, దరువు కళాబృందం రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్న, భీమ్ డ్రమ్స్ వ్యవస్థాపకులు నలిగంటి శరత్, ఎమ్మెస్ ఎఫ్ అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్, పల్లేర్ల సుధాకర్, అందే భాస్కర్,డా.దరువు శీను తదితరులు పాల్గొన్నారు.




## సమస్యలపై స్పందిస్తూ ప్రజల పక్షాన నిలుస్తూ: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి24(వాయిస్ టుడే ) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా పలు కార్యక్రమాలలో పాల్గొనాలని వారినిఆహ్వానించారు.అదేవిధంగా దుండిగల్ సర్కిల్ బహదూర్పల్లి బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు శివ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్సీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.